పశు గణనకు సమాయత్తం

- నేటి నుంచి 120 రోజులు నిర్వహణ
- ప్రత్యేక యాప్‌లో నమోదు
- 157 మంది ఎన్యూమరేటర్లు, 19 మంది సూపర్‌వైజర్ల నియామకం



నూజివీడు: ఐదేళ్లకోసారి నిర్వహించే పశుగణనకు పశు సంవర్ధక శాఖ సమాయత్తమైంది. ఇందుకోసం డివిజన్ పరిధిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్రవారం నుంచి పశుగణనను చేపట్టనున్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు, ఇలా అన్ని రకాల పశువుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ప్రతి ఐదేళ్లకోసారి దేశవ్యాప్తంగా పశు గణన చేపడతారు. చివరిగా 2018లో 20వ పశు గణన నిర్వహించారు. జాతీయ స్థాయిలో దేశమంతా శుక్రవారం నుంచి ఫిబ్రవరి 24, 2025 వరకు అంటే నాలుగు నెలల పాటు 21వ పశు గణన ప్రక్రియ చేపట్టనున్నారు.

ఎన్యూమరేటర్లకు శిక్షణ

నూజివీడు డివిజన్‌లో పక్కాగా పశు గణన కోసం 157 మంది ఎన్యూమరేటర్లు, 19 మంది సూపర్‌వైజర్లను నియమించడంతో పాటు పశువుల లెక్కింపు విధానంపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. డివిజన్‌లో ప్రస్తుతం 41,378 తెల్లజాతి పశువులు ఆవులు, ఎద్దులు, 2.45 లక్షల నల్లజాతి పశువులు, 1.84 లక్షల గొర్రెలు, 1.02 లక్షల మేకలు, 6,132 పందులు ఉన్నట్లు అధికార గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ప్రతీ ఇంటికి వెళ్లి నమోదు

పశు గణనకు ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి యజమాని వివరాలతో పాటు భూమి, పశువుల వివరాలు, చూడి, పాడి పశువులు, జెర్సీ, ఇతర ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, పెరటి కోళ్లు, కోళ్లఫారాల్లోని కోళ్లు, వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు, ఎద్దులు తదితర మూగజీవాల వివరాలను సేకరించి, వాటిని ప్రత్యేక యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. సంకర జాతి, దేశీయ జాతి పశు సంపదను వేర్వేరుగా సేకరిస్తారు. ప్రతి అంశానికి ఒక విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. మొత్తం 71 కాలమ్స్‌లో పశువులకు సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

పథకాల రూపకల్పనకు అవకాశం

పశు గణన ద్వారా గతంలో కంటే పశువుల సంఖ్య పెరిగిందా, తగ్గిందా అనే వివరాలు తెలుస్తాయి. తద్వారా పశువుల కోసం, పశు పోషకుల కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలి. సిబ్బంది అవసరం ఎంత మేరకు ఉంది. మందులు సరిపడా ఉన్నాయా, పశు వైద్యశాలలు, వైద్యుల సంఖ్యను పెంచాలా లేదా తదితర అంశాలకు ప్రణాళికను రూపొందించేందుకు వీలవుతుంది. పాలు ఇచ్చే పశువులు ఎన్ని, పాలు ఇవ్వని పశువులు ఎన్ని అనే వివరాలు కూడా తెలుస్తుంది. గతంలో కంటే పాడి పెరిగిందా, తగ్గిందా అనే వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి. తద్వారా పాడి పరిశ్రమకు ఏ మేరకు నిధులు కేటాయించాలనే విషయమై ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది.

పశు గణనకు సహకరించండి



మీ ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు పశు పోషకులు ఖచ్చితమైన వివరాలను తెలియజేసి పశు గణనకు సహకరించాలి. వివరాలన్నింటిని ఆన్‌లైన్ యాప్‌లోనే నమోదు చేస్తారు. కాబట్టి సమగ్ర సమాచారాన్ని ఎన్యూమరేటర్‌కు తెలపాలి. పశుగణన వల్ల పశుపోషకులకు ఎంతో ఉపయోగం కలుగుతుంది.

– డాక్టర్ కె.చంద్రశేఖర్‌రావు, పశు సంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్, నూజివీడు

క్లుప్తంగా

వేణుగోపాలుడిని దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే



నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి దేవస్థానాన్ని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గురువారం దర్శించుకుని పూజాదికాలు నిర్వహించారు. వారిని అర్చకులు ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ సీహెచ్ రాజేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఈ-కాప్ నమోదు జాబితాల ప్రదర్శన

నూజివీడు: రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం గురువారం మండలంలోని గొల్లపల్లి గ్రామ సచివాలయం వద్ద వ్యవసాయ శాఖ నూజివీడు ఏడీ జి.విద్యాసాగర్ నేతృత్వంలో ప్రదర్శించారు. ఏడీ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయాలన్నా, ప్రభుత్వం నుంచి రైతులకు రాయితీలు లభించాలన్నా సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ చాముండేశ్వరి, గ్రామ ఉద్యాన సహాయకురాలు కృపారాణి, రైతులు పాల్గొన్నారు.

మైలవరం ఏసీపీ ప్రసాదరావుకు అశోక చక్ర అందజేత



మైలవరం: పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి సేవలకు గుర్తింపుగా ఏసీపీ వై. ప్రసాదరావుకు అశోక చక్రను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పీఏ నాగమల్లేశ్వరరావు ఏసీపీ కార్యాలయంలో గురువారం అందజేశారు. అనంతవరం గ్రామ ప్రముఖులు బొందలపాటి సుధాకర్, స్థానిక ప్రభుత్వాస్పత్రి చైర్మన్ చారుగుండ్ల ప్రసాద్, బి. మల్లి, షేక్ మమ్ము పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

నూజివీడు: యనమదల ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 జమలయ్య గురువారం సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాల స్థాయిలో పిల్లలకు చదవడం, రాయడంతో పాటు గణితంలో చతుర్విధ ప్రక్రియలను నేర్పాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమణి పాల్గొన్నారు.

వైభవంగా శివాలయం వార్షికోత్సవం

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడులోని బాలాత్రిపుర సుందరీదేవి సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయం (శివాలయం) ప్రథమ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ హాజరై స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

కాచవరం(ఇబ్రహీంపట్నం): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో దేశభక్తిపై విద్యార్థులకు వివిధ రకాల పోటీలను గురువారం నిర్వహించారు. కాచవరం ఎంపీపీ పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుల వీరగాథలు, చిత్రలేఖనం, వ్యాసరచన, మల్టీమీడియా తదితర పోటీలు నిర్వహించారు. వీరగాథలు అంశంలో బాలబాలికలు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో అలరించారు. ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు రూ.10 వేల ప్రోత్సాహక బహుమతిని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని హెచ్‌ఎం నాగమల్లేశ్వరి తెలిపారు. హిందీ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్‌పాషా పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

తిరువూరు: దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తిరువూరు ఆర్డీఓ మాధురి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం రెవెన్యూ, పోలీస్, విద్యుత్, అగ్నిమాపక అధికారులతో సమావేశం నిర్వహించారు. దుకాణాలకు తాత్కాలిక లైసెన్సులు జారీ చేసేందుకు సిఫారసు చేసే సమయంలో అన్ని నిబంధనలూ పాటించాలని సూచించారు.

మాలధారులకు అన్నప్రసాదం

తిరువూరు: స్థానిక స్వామి అయ్యప్ప దేవాలయంలో అన్నప్రసాద వితరణను గురువారం ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి రోజూ 300 మందికి పైగా అయ్యప్ప, భవానీ, శివ దీక్షాపరులకు మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందిస్తామని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సంకా రాజారావు, కొల్లిపర సుబ్బారావు తెలిపారు.

రైతుల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

తిరువూరు ఆర్డీఓ కె. మాధురి

తిరువూరు: గ్రామసభల ద్వారా రైతుల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని తిరువూరు ఆర్డీఓ కె. మాధురి అన్నారు. తిరువూరు, గంపలగూడెం మండలాల్లో గురువారం జరిగిన రెవెన్యూ గ్రామసభల్లో ఆమె పాల్గొన్నారు. గంపలగూడెం, కోకిలంపాడు, అక్కపాలెం గ్రామాల్లో జరిగిన గ్రామభల్లో పాల్గొన్న ఆర్డీఓ గతంలో జరిగిన రీసర్వేలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సర్వే నంబర్లలో, సరిహద్దుల్లో తప్పులు దొర్లడం, విస్తీర్ణంలో తేడాలు గమనించి సరిచేయాలని సూచించారు. ముష్టికుంట్ల గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది పని తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అర్జీలను తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. తిరువూరు, గంపలగూడెం తహసీల్దార్లు లక్ష్మి, రాజకుమారి, డివిజనల్ సర్వేయర్ సారంగపాణి, తిరువూరు, గంపలగూడెం మండలాల సర్వేయర్లు, వీఆర్‌ఓలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



కోకిలంపాడు సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధురి



అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్

చిత్తపూరు సభకు 33 దరఖాస్తులు

చాట్రాయి: ఆన్‌లైన్‌లో సబ్ డివిజన్ అయిన భూములను క్రయ విక్రయాలు జరుపుకోవచ్చని తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. గురువారం మండలంలోని చిత్తపూరులో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ రైతులు భూ సమస్యలు ఉంటే ఈ సభల్లో తగిన ఆధారాలతో అర్జీలు అందజేయాలని, వీటిని 15 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామసభకు 33 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు చిట్టిబాబు, రాందాసు, రీసర్వే డీటీ గీత, సర్వేయర్లు ప్రేమకుమార్, లక్ష్మీ నారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- ఆగిరిపల్లి: రీసర్వేలో నెలకొన్న భూ సమస్యలను గ్రామ సభలో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ప్రసాద్ సూచించారు. మండలంలోని కలటూరులో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలపై అర్జీలను తహసీల్దార్ ప్రసాద్‌కు అందజేశారు. రీసర్వే డీటీ మరియన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- ముసునూరు: గోపవరంలో నిర్వహించిన గ్రామ సభకు భూ సమస్యల పరిష్కారం కోసం 125 అర్జీలు అందాయని ఆర్‌ఐ దీపిక తెలిపారు. వీఆర్వో శ్రీనివాసరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

చిలుకూరువారిగూడెం(మైలవరం): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మైలవరం మండలం చిలుకూరువారిగూడెం శ్రీ అప్పిడి సుబ్బారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. నారాయణరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న జగ్గయ్యపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ ఎంపిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు అండర్-17 విభాగానికి కోటిపల్లి స్రవంతి, అండర్ -14 విభాగానికి దుర్గం మధు ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులను, వ్యాయామోపాధ్యాయులను పాఠశాల యాజమాన్య కమిటీ, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.



వరలక్ష్మిని అభినందిస్తున్న హెచ్‌ఎం



ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం నారాయణరావు తదితరులు

- గంపలగూడెం: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వేల్పుల వరలక్ష్మి ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు బొల్లెపోగు కిరణ్ తెలిపారు. బాపట్ల జిల్లా పిట్లవానిపాలెంలో జరుగనున్న అండర్-14 రాష్ట్ర స్థాయి బాలికల పోటీల్లో వరలక్ష్మి పాల్గొంటుందని చెప్పారు. విద్యార్థిని వరలక్ష్మిని, శిక్షణ ఇచ్చిన పీడీ బంకా రాంబాబును కిరణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో తిరువూరు విద్యార్థిని ప్రతిభ

తిరువూరు: జగ్గయ్యపేటలో బుధవారం జిల్లా స్థాయిలో జరిగిన అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తిరువూరు నాగార్జున పాఠశాల విద్యార్థిని వి. సువర్ణ ప్రథమస్థానం సాధించిందని ప్రిన్సిపాల్ నరసింహారావు తెలిపారు. 55 కేజీల విభాగంలో తమ పాఠశాల పదో తరగతి విద్యార్థిని వి. సువర్ణ ప్రథమ స్థానంలో నిలిచిందని, నవంబర్ 2,3 తేదీల్లో తెనాలిలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ అభినందించారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

గంపలగూడెం: ట్రక్‌లో 200 తెలంగాణ మద్యం సీసాలను తీసుకువస్తూ కనుమూరుకు చెందిన షేక్ బాజీ వలీ టాస్క్‌ఫోర్స్ అధికారులకు పట్టుబడ్డాడు. ట్రక్కుతో సహా మద్యం స్వాధీనం చేసుకుని బాజీ వలీని అరెస్టు చేశామని తిరువూరు సర్కిల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ వర్మ తెలిపారు. నిందితుడిని తిరువూరు కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్‌కు మేజిస్ట్రేట్ ఆదేశించారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శేఖర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

మైలవరం: మైలవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రెడ్డిగూడెం మండలంలో సారా అమ్మకాలు, తయారీదారులపై గురువారం ఎక్సైజ్ అధికారులు దాడి చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట తండాకు చెందిన మహిళ భరోత్ కనక వద్ద 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ అధికారి జోశ్యుల శ్రీనివాస్ తెలిపారు. కూనపురాజుపర్వకు చెందిన నాగయ్య, చంద్రుపట్ల తండాకు చెందిన దాసు ఇద్దరూ కలిసి 8 లీటర్ల సారాను బైక్‌పై తీసుకువెళుతుండగా ఇద్దరినీ అరెస్టు చేసి మైలవరం కోర్టులో హాజరుపరచగా నిందితులకు రిమాండ్ విధించి, నూజివీడు సబ్ జైల్‌కు పంపారు.

ఉచిత ఇసుక అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి పార్థసారథి

ముసునూరు: ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అక్రమంగా రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేయడంతోపాటు, పీడీ యాక్ట్ అమలు చేస్తామని మంత్రి కె.పార్థసారథి స్పష్టం చేశారు. వలసపల్లి, యల్లాపురంలో ఉచిత ఇసుక రీచ్‌లను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ట్రాక్టర్ల రవాణా చార్జీలు ఎక్కువ వసూలు చేయడానికి వీలులేదన్నారు. గ్రామ దూరాన్ని బట్టి తగిన ధర మాత్రమే వసూలు చేయాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద వీఆర్వో, సచివాలయ సిబ్బందిని పర్యవేక్షణకు నియమించామని చెప్పారు. సర్పంచ్ చలసాని దామోదరరావు, నూజివీడు ఆర్డీఓ ఎం.వాణి, తహసీల్దార్ పురుషోత్తమ శర్మ, ఎంపీడీఓ జి.రాణి పాల్గొన్నారు.



ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

పెండింగ్ జీతాలు విడుదల చేయాలని ధర్నా

నూజివీడు: ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు వారిని ఆప్కాస్‌లో కలపాలని మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆస్పత్రి గేట్ వద్ద పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏ నెల జీతాలు ఆ నెలే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు, కార్మికులు నల్లమోతు శివ, వెంకటేశ్వరరావు, ఏలియా, యు.పద్మ, మరియమ్మ, కె.నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది

నేటి నుంచి డ్వాక్రా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మెప్మా అర్బన్ మార్కెట్‌ను శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేస్తున్నామని పట్టణ సిటీ మిషన్ మేనేజర్ శ్రీధర్ గురువారం తెలిపారు. పట్టణ మార్కెట్‌ను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభిస్తారన్నారు. కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని డ్వాక్రా సంఘాల సభ్యులు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులు ప్రదర్శించి విక్రయిస్తారని చెప్పారు.

బాణసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి

తిరువూరు: దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా అమ్మకాలు జరిపేవారు తప్పనిసరిగా అనుమతి పొందాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధురి అన్నారు. నిబంధనల మేరకు పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతి పొంది నిర్ణీత స్థలంలోనే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తిరువూరు: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా తిరువూరు శ్రీనిధి స్కూల్లో గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైబర్ క్రైమ్ నిరోధంలో యువత పాత్ర అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తిరువూరు సెక్టార్-1 ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ నానాటికీ పెరుగుతున్న సైబర్ నేరాల కట్టడికి తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి వ్యాసరచన పోటీలు నిర్వహించామని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మైలవరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రమేష్ తెలిపారు. బస్టాండ్ ఏరియా, బీఎస్ఎన్ఎల్ రోడ్డు, రాజాపేట, మాదాస్ కాలనీ, చంద్రబాబు నగర్, బైపాస్ రోడ్డు, ఆల్ఫా సెంటర్, నూజివీడు రోడ్డు, కుమ్మరి వీధి, శివాలయం వీధి, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు, మాలపల్లి, వడ్డెర కాలనీ, సూరిబాబు పేట, దేవుని చెరువు, చిన్నగూడెం, హాజీపేట తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత

ఆగిరిపల్లి: దాతలు ఇచ్చిన ఆర్థిక సాయంతో దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తున్నారని హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్య ప్రసాద్ అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ సంస్థలో దాతలు ఇచ్చిన ఆర్థిక సాయంతో గురువారం ఐదుగురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదరించడం మానవుల కర్తవ్యమన్నారు. కృత్రిమ కాళ్లను అందజేసిన దాతలు కాకర్ల శంకరరావు, తాతారావు, రాజ్యలక్ష్మి, రాధికను ఆయన అభినందించారు. కార్యక్రమంలో హీల్ సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్, హీల్ యూకే ప్రతినిధి జూలీ, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తిరువూరు: తిరువూరు ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ కార్మిక సంఘ నాయకులు గురువారం డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యంకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ పని చేస్తూ బదిలీపై వెళ్లిన టి. వేణు స్థానంలో గురువారం బాధ్యతలు స్వీకరించిన డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యంకు కార్మికులు తమ సమస్యలు తెలిపారు. రద్దు చేసిన సర్వీసుల పునరుద్ధరణ, డ్యూటీల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు.

పశుగణన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నూజివీడు: 21వ అఖిల భారత పశుగణన వాల్‌పోస్టర్‌ను మంత్రి కొలుసు పార్థసారథి గురువారం నూజివీడులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ పశుగణను పక్కాగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పశుగణన నిర్వహించే తీరును పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ కె.చంద్రశేఖర్ మంత్రికి వివరించారు. నాలుగు నెలల పాటు పశుగణన జరుగుతుందని చెప్పారు. డివిజన్‌లోని పలు మండలాలకు చెందిన పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని విద్య విజయాలకు చిహ్నం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఒత్తిడి లేని విద్య విజయాలకు చిహ్నమని ఉమ్మడి కృష్ణా జిల్లా లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎ.కోటిరెడ్డి అన్నారు. కొండపల్లి జెడ్పీ బాలకల పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. పాఠశాల స్థాయిలోనే టెక్నాలజీపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. విద్యాహక్కు చట్టాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథ రెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్స్ బి.కృష్ణారెడ్డి, ఎన్. బుల్లిరాజు చౌదరి, వెంకటేశ్వరరావు, సురేష్, శ్రీధర్, పద్మలత పాల్గొన్నారు.

ఉచిత ఇసుకకు సీనరేజీ వసూలు

తిరువూరు: గానుగపాడు కట్టిలేరు వాగు నుంచి ఉచితంగా ఇసుక తీసుకువెళ్లే వారి వద్ద గ్రామస్తులు సీనరేజీ వసూలు ప్రారంభించారు. వాగులో ఇసుక ట్రాక్టర్లు లోడింగ్‌కు వచ్చినపుడు రూ.100 చొప్పున చెల్లించాలని గ్రామస్తులు నిర్ణయించారు. ఈ మేరకు గురువారం ట్రాక్టర్ల నుంచి నిర్బంధంగా సీనరేజీ పేరుతో వసూలు చేశారని పలువురు ఆరోపించారు. ట్రాక్టర్లు తమ పొలాల గుండా ఇసుకతో వెళ్లేటప్పుడు పంటలు ధ్వంసమవుతున్నాయని, నష్టపరిహారం కోసం ఈ సొమ్ము వసూలు చేస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. దీనిపై తిరువూరు తహసీల్దార్ లక్ష్మిని వివరణ కోరగా, సీనరేజీ పేరుతో ఎవరైనా డబ్బు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతామన్నారు.

27న ఉచిత వైద్య శిబిరం

ముసునూరు: చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఈనెల 27వ తేదీన ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని బౌద్ధమత శాఖ ఉయానా మోనాస్ట్రీ చెక్కపల్లి ప్రతినిధులు తెలిపారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని చెప్పారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ఆగిరిపల్లి: కనసానపల్లి శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై ఎస్ఐ శుభశేఖర్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. 10 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,100 నగదును, 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

29న విజయవాడలో జేఏసీ సమావేశం

నూజివీడు: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి, ట్రేడ్ యూనియన్లు, జాయింట్ యాక్షన్ కమిటీల విస్తృత సమావేశం ఈ నెల 29న విజయవాడలో నిర్వహిస్తామని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరినాథ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రైతాంగ ఉద్యమ విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేయడాన్ని నిరసిస్తూ నవంబర్ 26న దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రదర్శనలు, సభలు, ధర్నాలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చిందని చెప్పారు. నవంబర్ 26న జరిగే ఆందోళనలను విజయంతం చేసేందుకుగాను ఈనెల 29న సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

పాడి రైతుల ప్రయోజనాలే లక్ష్యం

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని

కాకర్ల(తిరువూరు): పాలు సరఫరా చేసే రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కృష్ణా మిల్క్ యూనియన్ పనిచేస్తోందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కాకర్లలో పాల ఉత్పత్తిదారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పాలు పోస్తే మంచి ధర వస్తుందని, వినియోగదారులకు సంతృప్తి కలిగే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పశు వైద్యుడు ప్రసాద్, జిల్లా ట్రస్ట్ బోర్డు సభ్యుడు సత్యనారాయణ, క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం

తిరువూరు: స్థానిక స్వామి అయ్యప్ప దేవాలయానికి తిరువూరుకు చెందిన కాంట్రాక్టర్ యంత్రాతి భాస్కరరావు రూ.50 వేల విరాళాన్ని గురువారం అందజేశారు. ఆలయ అభివృద్ధి నిమిత్తం ఈ నగదును కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సంకా రాజారావు, కొల్లిపర సుబ్బారావులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు జ్ఞాపిక బహూకరించి సత్కరించారు.

ఆధార్ శిబిరాలకు నేడు తుది గడువు

నూజివీడు: ఆధార్ ప్రత్యేక శిబిరాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఈ నెల 22 నుంచి ప్రారంభమైన శిబిరాల్లో ప్రజలు ఆధార్‌కార్డుల్లోని తప్పులను సవరించుకునేందుకు ప్రత్యేక శిబిరాలకు ప్రజలు విచ్చేశారు. నూజివీడు మండలంలో ఒక్క ఆధార్ కిట్ మాత్రమే ఉండటంతో రోజుకొక గ్రామంలో ఆధార్ సేవలను అందిస్తున్నారు. ఇప్పటి వరకు పాతరావిచర్ల, మొర్సపూడి, గొల్లపల్లిలో శిబిరాలను నిర్వహించారు. చివరి రోజు శుక్రవారం సీతారామపురంలో ఏర్పాటు చేయనున్నారు. పట్టణంలో మూడు సచివాలయాల్లో ఆధార్ కిట్లు ఉన్నప్పటికీ కేవలం నాలుగో సచివాలయంలోని కిట్ మాత్రమే పనిచేస్తుండటంతో అక్కడ మాత్రమే ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. బంగినపల్లితోటలోని సీఆర్సీ సెంటర్, 9వ సచివాలయంలో కిట్లు పనిచేయడం లేదు. మండలంలో ఒక శిబిరం, పట్టణంలో ఒక శిబిరం మాత్రమే పని చేస్తుండటంతో దాదాపు 1.50 లక్షల మంది ఉన్న జనాభాకు అరకొరగా మాత్రమే సేవలు అందుతున్నాయి.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

మైలవరం: ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం తక్షణమే ఐఆర్ 30 శాతం ప్రకటించాలని పీఆర్‌టీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి షేక్ నవాబ్ జానీ, కోసూరి రాజశేఖర్ డిమాండ్ చేశారు. చిలుకూరివారిగూడెం, చంద్రగూడెం, మొర్సుమల్లి గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. యూనియన్ మండల అధ్యక్షుడు పల్లపోతుల గోపాల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోలా రాఘవరాజు, రాష్ట్ర కార్యదర్శి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుని, ఆధునిక సాంకేతికతపై పట్టు సాధిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని సీనియర్ ఎంబెడెడ్, ఐఓటీ డెవలపర్ సి.సుధాకరరెడ్డి అన్నారు. నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విత్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అనే అంశంపై ఈ నెల 22, 23, 24 తేదీల్లో జరిగిన వర్క్ షాపులో సుధాకరరెడ్డి రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించి పలు సూచనలు చేశారు.